విశాలాంధ్ర విశాఖపట్నం
బుధవారం 13, ఆగస్టు 2025
పేజి నెం. 5

స్నిగ్ధ శ్రీదేవి ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర - తగరపువలస: కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతి సందర్భంగా భీమిలి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి సిఐ తిరుమలరావు విచ్చేసారు. మ్యాచ్‌లో భీమిలి జట్టు, విజ్జు జట్టు కొమ్మాది పాల్గొనగా 4:1 స్కోర్‌తో భీమిలి జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సూర్య నారాయణ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, గంటా నూకరాజు, 3వ వార్డ్ కార్పొరేటర్ అప్పలకొండ, మైలపల్లి షణ్ముఖరావు, అతిలి చిన్నబాబు, అక్కరమాని చిన్నబాబు పాల్గొన్నారు.

23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

విశాఖ సమగ్రాభివృద్ధికి పోరాటాలు → మహాసభల గోడపత్రిక విడుదల

విశాలాంధ్ర - విశాఖ: సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్ వెల్లడించారు. రాష్ట్ర మహాసభల్లో విశాఖ జిల్లా సమగ్ర అభివృద్ధి, పార్టీ చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, రానున్న రోజుల్లో పోరాటాలను ఉధృతం చేయనున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలతో కలసి సీపీఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమకు ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వ భూములను పంచుతోందని విమర్శించారు. నగరంలో వేల కోట్ల విలువైన బీచ్ రోడ్డులోని 14 ఎకరాల భూమిని లులూకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. తక్షణమే లులూకు ఇచ్చిన భూమి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండు చేశారు. ప్రభుత్వ రంగంలోని నవరత్న సంస్థలలో విశాఖ ఉక్కు కర్మాగారానికి కాకుండా ప్రైవేటు మిట్టల్ సంస్థకు బొగ్గు గనులు ఇవ్వాలని జిల్లాలోని ప్రజాప్రతినిధులు కేంద్రాన్ని కోరడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ మరింత గట్టిగా పోరాడు తుందని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా విశాఖ నగర అభివృద్ధికి ఎటువంటి స్పష్టమైన ప్రణాళికలు రూపొందలేదని దుయ్యబట్టారు. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ పనుల్లో పురోగతి లేకుండా పోయిందని పేర్కొన్నారు. వాల్తేర్ డివిజన్‌పై అస్పష్టత, ఈస్ట్ కోస్ట్, సౌత్ సెంట్రల్ రైల్వేల మధ్య ఆస్తుల వివాదం, ఉద్యోగుల కేటాయింపు వంటి సమస్యలను పరిష్కరించి, రూ.9,138 కోట్లతో యుద్ధ ప్రాతిపదికన జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలన్నారు. నగరం చుట్టపక్కల వేల సంఖ్యలో టిడ్కో ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, అక్కడ తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించి లబ్దిదారులకు అందించాలనే డిమాండుతో భారీ పోరాటాలకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. విశాఖలో ఐటీ కోసం ప్రత్యేక పాలసీని రూపొందించి పక్కా ప్రణాళికలతో అభివృద్ధి చేయాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు కె.సత్యనారా యణ, పి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, కె. సత్యాంజనేయ, సి.ఎన్.క్షేత్రపాల్ రెడ్డి, కె.వనజాక్షి ఎన్.నాగభూషణం, ఎం.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకుందాం

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భావితరాల్లో భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందిద్దామని, భారతమాత ముద్దుబిడ్డలుగా మాతృభూమి రుణం తీర్చుకుందామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక బీచ్ రోడ్డులో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ఉత్సాహంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు గాను తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించామని గుర్తు చేశారు. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహ విద్యార్థులు థింసా నృత్యం చేయగా, గాజువాకకు చెందిన విద్యార్థులు భరతనాట్యం చేశారు. కార్యక్ర మంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, బెటాలియన్ కమాండెంట్ భగత్ సింగ్, 198, 234 బెటాలియన్లకు చెందిన ఇతర అధికారుల, సిబ్బంది, డివిజనల్ పీఆర్వో డి.నారాయణరావు, ఏవీ సూపర్ వైజర్ వెంకటరావు, ఏఈ రామకృష్ణ, టూరిజం అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని మండల కూటమి నాయకులు పిలుపునిచ్చారు. 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు వాలంటీర్‌గా భాగస్వామి కావాలని జాతీయ జెండాలను తర్వాత తమ తమ ఇళ్లమీద ఎగురవేసి, తమ పరిధిలోని ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఆనందపురం జంక్షన్ గోపి మెడికల్ షాప్ నుంచి కోరాడ శంకర్రావు ఇల్లు వేములవలస రామాలయం, శ్రీ కృష్ణ మందిరం నుంచి జంక్షన్ సర్కిల్ దగ్గర మహాత్మ గాంధీకి మాల వేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో సత్కరించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాపురం: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రముఖ గ్రంథాలయాధికారి, సార్వత్రిక విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు డి. మురళీధర్ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి ఉత్సవంలో ఆయన మాట్లాడారు. యువత ఎస్.ఆర్.రంగనాథంను స్ఫూర్తిగా తీసుకుని, జీవితంలో విజయాలు సాధించాలని, పోటీ పరీక్షలకు చదివి, ఉద్యోగాలను సంపాదించాలని అన్నారు. కార్యక్రమంలో మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ. శ్రీనివాసరావు, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొని ప్రసంగించారు. తొలుత ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమం మొత్తాన్ని గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ సమన్వయపరిచారు.

నగర మేయర్‌ను కలిసిన స్థాయి సంఘం సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఇటీవల నూతనంగా ఎన్నికైన స్థాయి సంఘం సభ్యులు నగర మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం పెందుర్తి మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థాయి సంఘం సభ్యులు విశాఖ నగర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, స్థాయి సంఘంలో ప్రతి అంశం అభివృద్ధి కొరకు ప్రాధాన్యత ఇస్తూ క్షుణ్ణంగా చర్చ జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థాయి సంఘం సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వెంకట రామేశ్వరరావు, సేనాపతి వసంత, గేదెల లావణ్య, రాపర్తి త్రివేణి వరప్రసాద్, మాదంశెట్టి చిన తల్లి, మొల్లి ముత్యాలు, తెలుగుదేశం నాయకులు మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అదీప్ రాజ్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర - పెందుర్తి : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ కన్వీనర్ అన్నరెడ్డి అదీప్ రాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిసిన అదీప్ రాజ్ ఇటీవల రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డిని శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు

సృష్టి కేసు వ్యవహారంలో ఇద్దరు కేజీహెచ్ వైద్యులు అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: సృష్టి కేసు వ్యవహారంలో కేజీహెచ్‌కి సంబంధించిన ఇద్దరు వైద్యులు డాక్టర్ రవి, ఉషాదేవిలను అరెస్టు చేశామని తెలంగాణ పోలీస్ అధికారులు మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి అధికారికంగా తెలిపారు. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఈరోజే సంచలనాత్మక నిర్ణయం తీసుకుంటూ సిట్ ఏర్పాటు చేసింది. కేవలం హైదరాబాదులో కన్సల్టెన్సీ మాత్రమే జరగగా విశాఖలోని లోటస్ ఆసుపత్రి వేదికగానే ఈ వ్యవహారం అంతా నడిచిందని తెలంగాణ కేసు విచారణ చేస్తున్న నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 25 మంది అరెస్టులు, ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదు కాక త్వరలోనే విశాఖకు చెందిన ఇద్దరు పీడియాట్రిషన్లు ఒక గైనకాలజిస్ట్ వైద్యులతో పాటు నలుగురు దళారులను అరెస్టు చేయనున్నామని ఆమె పేర్కొన్నారు.

విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలి

- ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నగరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ పూర్వపు నాయకులు డాక్టర్ సీఎన్.క్షేత్రపాల్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ భారతదేశ స్వాతంత్రం మా జన్మ హక్కు అని ఈ దేశాన్ని పాలిస్తున్నటువంటి బ్రిటిష్ తెల్ల దొరలను తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం అని కొనియాడారు. ఆగస్టు 12 1936 ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం నిర్వహించి నేటికి 90 సంవత్సరాలు కావస్తుందన్నారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులను అనుమతించని జీవోలు ఎవరికోసం ఎవరి లబ్ది కోసమని ప్రశ్నించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ తల్లికి వందనం పథకం చాలా మంది విద్యార్థులకు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. యువగలం పాదయాత్రలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయకుండా జీవో నెంబర్ 107, 108 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇ. శేఖర్, ఉపాధ్యక్షులు జే.అభిషేక్, సహాయ కార్యదర్శి హేమానంద్, మౌనిక, కోశాధికారి భవాని, కార్యవర్గ సభ్యులు గ్రేస్ ప్రకాష్, శివరాజ్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అల్లిపురంలోని సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యు.నాగరాజు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి పౌష్టికాహారం అందించాలని కోరారు. ఫీజుల భారాన్ని తగ్గించాల న్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించినప్పుడే ప్రభుత్వ విద్యా సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లా అధ్యక్షులు వి.శేఖర్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం గతంలో ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని, ఆ హామీలు అమలు చేయా లని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీను, ఉపాధ్యక్షులు జె.అభిషేక్, సహాయ కార్యదర్శి హేమానంద్, మౌనిక, కోశాధికారి భవాని, కార్యవర్గ సభ్యులు గ్రేస్ ప్రకాష్, శివరాజ్ కుమార్, యూనివర్సిటీ విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ రంగనాథన్ జయంతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని పెదగంట్యాడ శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. 75వ వార్డ్ కార్పొరేటర్ పులి ఝాన్సీ లక్ష్మీబాయి ఎస్సార్ రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అద్దంకి రాఘవాచారి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో 25 సంవత్సరములు పనిచేసి వదవీ విరమణ చేసిన బి.అమ్మాజీని ఘనంగా సన్మానించారు. పెదగంట్యాడ మండల టీడీపీ అధ్యక్షుడు. పులి వెంకట రమణారెడ్డి బిరుదు అమ్మాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్.వి నరసింహం, బి.చంద్రకళ, వి.శిరీష, బి.వీ.ఎస్.అప్పారావు, నూకరాజు, డీ.సీ.ఎల్.ఎల్.వర్మ, బి.పద్మావతి, బి.కనకరాజు, ఎన్.పద్మావతి, వి.అజయ్ కుమార్, బి.సూర్యకళ, గ్రంథాలయ అధికారి పి.వి.రమణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్టీసీలో ఉద్యోగాలు ఇవ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామనమూర్తి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలు ఇవ్వాలని , రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఫ్రీ బస్ అమలును పున: పరిశీలించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని, వాహన మిత్ర 15000 విడుదల చేయాలని, జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ, కె.దేవుడు, రవికృష్ణ, ఈ.రాజు, బి.నూకరాజు, పి.అప్పల్రాజు, శ్రీనివాసు, కే.రాము, కే.వెంకటేశు, పిపి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడలో నేటి నుండి సర్వే

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కొవ్వాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 237లో సుమారు 350 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కొరకు సమీకరించడం జరిగింది. దీనికి సంబంధించిన రైతులతో కాటికపల్లి గ్రామంలో భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్, పద్మనాభం తహశీల్దార్ కాకర ఆనందరావు రైతులకు గ్రామసభ ఏర్పాటు చేసి అవగాహన సదస్సును నిర్వహిం చారు. రైతులు చెప్పిన సమస్యలను అవగాహన సదస్సులో క్షుణ్ణంగా ఆలకించి రైతులకు దీనిపై వివరణ ఇవ్వడం జరిగింది. ఈ ల్యాండ్ పూలింగ్ సంబంధించిన రైతులు గుర్తించి నేటి నుంచి సర్వే నెంబరు 237లో సర్వే నిర్వహించబడనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర - పెందుర్తి: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దృష్టి ఆరోగ్యాన్ని పెంచడం, అంధత్వాన్ని నివారించడం లక్ష్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (పి.ఆర్) కే.బంగార్రాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఫౌండర్స్ డే (ఆత్మకూరి శంకర్ రావు జయంతి) సందర్భంగా సెప్టెంబర్ 2న వివిధ పోటీలలో పాల్గొనడానికి పాఠశాల, కళాశాల విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థుల కోసం ఆగస్టు 19 నుండి 26 వరకు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో 8 పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆగస్టు 19న ఆస్టో ఫేర్, ఆగస్టు 20న పాటల పోటీ, ఆగస్టు 21న శ్లోక పారాయణం, ఆగస్టు 22న గాజు పెయింటింగ్, ఆగస్టు 23న ఇమాజినరీ స్టోరీ టెల్లింగ్, ఆగస్టు 24న రోల్ ప్లే, ఆగస్టు 25న డ్రాయింగ్ పోటీ, ఆగస్టు 26న వక్తృత్వం పోటీలు నిర్వహిస్తామని, అలాగే కళాశాల విద్యార్థుల కోసం ఆగస్టు 20న, గానం, ఆగస్టు 22న గాజు పెయింటింగ్, ఆగస్టు 26న వక్తృత్వం పోటీలు జరుగుతాయని బంగార్రాజు తెలిపారు. సెప్టెంబర్ 1 శంకర్ ఫౌండేషన్ ప్రాంగణంలో విజేతలకు బహుమతులు ప్రదానం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

నులిపురుగులు నివారణతో ఆరోగ్యవంతమైన జీవితం

విశాలాంధ్ర - భీమిలి: నులిపురుగులు వ్యాప్తితో పిల్లల జీవితాలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకొని వైద్యుల సూచనలు పాటించి తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు కోరారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా భీమిలి జోన్ 3వ డివిజన్ శ్రీ నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. నులిపురుగుల నివారణతో రక్తహీనత నియంత్రణ, పోషకాల గ్రాహ్యతను మెరుగుపర్చే ప్రయోజనం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ కిలారి శాంతి కుమారి, అచ్యుతాంబ, రామలక్ష్మి, ఆశా వర్కర్లు వాసుపల్లి మీనా కుమారి, నొల్లి నందిని, సీత, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర- అగనంపూడి: గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు సుపరిపాలన తొలి అడుగులో భాగంగా అగనంపూడి 85వ వార్డు టీడీపీ అధ్యక్షులు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా దశేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1.3 బూత్ ఇంచార్జిలు అప్పలరాజు, తలుపుల నాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి 36 ఏళ్ళు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి అప్పటి దేవస్థానం ఉద్యోగులు తమ భక్తి భావంతో 1989 ఆగస్టు 14న తొలి విరాళంగా రూ.50,000 సమర్పించారు. ఆ చిన్న విత్తనం కాలక్రమేణా ఒక విశాల వృక్షంగా మారింది. భక్తుల అగాధ విశ్వాసం, కోట్ల రూపాయల విరాళాలు, వాటిపై వచ్చిన వడ్డీతో ఈ పథకం నిరాటంకంగా కొనసాగుతుంది. నిత్యం భక్తుల కడుపు తృప్తిగా నింపే ఈ మహా సేవ, కాల గమనంలో ఎన్నో దశాబ్దాలు దాటింది. రుచి, నాణ్యత, సేవ తపన ఇవే ఈ పథకానికి గుర్తింపు అయ్యాయి. ఇటీవలి కాలంలో ఆలయ ఈవో బాధ్యతలు స్వీకరించిన వేంద్ర త్రినాధరావు ఆధ్వర్యంలో, స్వామి వారి నిత్యాన్న ప్రసాదం భక్తులకు మరింత తృప్తిని ఇవ్వడంతో విరాళాల ప్రవాహం మరింత వేగం పెరిగింది. ఈ పథ కాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఆలయ అనువంశిక ధర్మకర్త కేంద్ర మాజీ మంత్రి గోవా రాష్ట్రం గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు సూచనల మేరకు పరిసరాల పరిశుభ్రత, ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేలా దృష్టిసారించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి, డిపాజిట్ మొత్తం రూ.36, 45,41, 720.00 లక్షలు చేరింది. ఇందు పై వచ్చే వడ్డీ 2024 - 2025 ఆర్థిక సంవత్స రానికి గాను 2,09,33, 275 కోట్ల రూపాయలు సమకూర్చబడుతుంది. ఈ వడ్డీతో మాత్రమే స్వామివారి నిత్యాన్న ప్రసాదం పథకం నిరాటంకంగా, విజయ వంతంగా కొనసాగు తోంది. దేవాలయ రికార్డుల ప్రకారం స్వామి వారి నిత్య అన్నప్రసాద పథకం ప్రారంభించినప్పటి నుంచి 10 లక్షలు లేదా అంతకు మించి 5 గురు దాతలు రూ.లక్ష లేదా అంత కుమించి విరాళం సమర్పించిన వారు 1217 మంది దాతలు ఉన్నారు. ఈ ఏడాదిలోనే సుమారు పది లక్షలకు పైగా భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారని ఆలయం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు తెలిపారు. 36 ఏళ్లుగా నిరాటకంగా కొనసాగుతున్న ఈ మహాసేవలో భాగమైన ప్రతి దాతకు కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

లోన్ యాప్ బాధితులకు తక్షణ సహాయం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసు వారు సైబర్ క్రైమ్ ఇన్స్టంట్ లోన్ యాప్ కేసులో సీజ్ అయిన క్రిప్టో కరెన్సీను ఇండియన్ కరెన్సీలోకి మర్చి ఆ అమౌంట్ను లోన్ యాప్ బాధితులకి అందించే కార్యక్రమం పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షణలో విశాఖపట్నం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు చర్యలు చేపట్టడం జరిగింది. విశాఖపట్నంలో సైబర్ క్రైమ్ గణాంకాలు ప్రకారం 295 లోన్ యాప్ బాధితులను గుర్తించడం జరిగిందని, అందులో సుమారు 100 మంది దాకా అధిక మొత్తంలో రుణాలు చెల్లించి డబ్బులు నష్టపోయి ఉన్నారని, సైబర్ క్రైమ్ ఇన్స్టాంట్ లోన్ యాప్ కేసులో సీజ్ అయిన క్రిప్టుని ఇండియన్ కరెన్సీలోకి మర్చి 48 లక్షల రూపాయలు లోన్ యాప్ బాధితులకి వాళ్ళ అకౌంట్లోకి లీగల్ ప్రాసెస్ ద్వారా జమ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోజురోజుకి సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. అనుమతి లేని ఆన్లైన్ లోన్ యాప్స్ ద్వారా లోన్ తీసుకొని సైబర్ నేరగాళ్ల వలలో చిక్కవద్దని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

జగన్‌ను కలిసిన కటుమూరి సతీష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా వైసీపీ అధ్యక్షులు కె కె రాజుతో డిప్యూటీ మేయర్ కటమూరి సతీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.ఇటీవల జరిగిన స్టాడింగ్ కమిటీ ఎన్నిక పట్ల వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కే కే రాజు, కటుమూరి సతీష్, పార్టీ నేతలను, కార్యకర్తలను అభినందించారు.

లూలూ మాల్ వద్దు.... సైన్స్ సిటీని నిర్మించండి...

ఆర్కే బీచ్‌ను కాపాడుకుందాం... పౌర, ప్రజాసంఘాల సమావేశంలో రాణి శర్మ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ ఆర్ కే బీచ్‌లో ఖాళీగా ఉన్న 13.78 ఎకరాల భూమిని లూలూ మాల్ అనే విదేశీ సంస్థకి ధారాదత్తం చేస్తూ రాష్ట్ర చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని, తమ స్వలాభం కోసం బీచ్ మొత్తాన్ని వ్యాపారంతో డంపింగ్ యార్డ్‌గా మార్చబోతున్నారని, ఆర్ కే బీచ్ యొక్క సహజ సిద్ధ పకృతి అందాలను ధ్వంసం చేయనున్నారని, ఈ ఒప్పందంలో వందల కోట్లు చేతులు మారాయని, తక్షణం ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని ప్రముఖ సామాజిక వేత్త రాణి శర్మ డిమాండ్ చేశారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన పౌర, ప్రజా సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లూలూ మాల్‌కి కేటాయించిన 13.78 ఎకరాల భూమిలో సైన్స్ సిటీని లేదా సైన్స్ పార్కుతో కూడిన సైన్స్ మ్యూజియంను నిర్మించాలని రాష్ట్ర కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆర్కే బీచ్‌లో ఉన్న 13.78 ఎకరాల భూమి మార్కెట్ విలువ అక్షరాల 3వేల కోట్లకు పైగా ఉందని, దీనిని ఉచితంగా 99 ఏళ్ళ లీజుకి చంద్రబాబు ప్రభుత్వం ధారాదత్తం చేసిందని, ఏడాదికి లీజు అద్దె కేవలం భూమి యొక్క ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలో కేవలం 1శాతం మాత్రమేనని, నిర్మాణాలు పూర్తయ్యేదాక లీజు చెలించాల్సిన అవసరంలేదని జీవో ఇచ్చారని, 10 ఏళ్ళకొకసారి లీజు 10శాతం మాత్రమే పెంచుతారన్నారు. రిజిస్ట్రేషన్ స్టాంప్‌డ్యూటీకి చెల్లించాల్సిన రూ.50కోట్లు రద్దు చేసారు. భూవినియోగ మార్పిడికి చెల్లించాల్సిన 'నాలా' ఛార్జీలు రూ.40కోట్లు మినహాయించారని, జివియంసికి చెల్లించాల్సిన సర్ ఛార్జీ రూ.5కోట్లు రద్దు చేసారని, 10ఏళ్లపాటు జిఎస్‌టి మినహాయించారన్నారు. దీనివల్ల ఏడాదికి కనీసం రూ.50కోట్లు ప్రభుత్వం నష్టపోతుందని, 5ఏళ్లపాటు విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరంలేదని, ఆస్తిపన్ను చెల్లించనక్కరలేదని, ఉచితంగా మంచినీరు ఇవిగాక లూలూ మాల్‌లో పనిచేసే ఉద్యోగులకు పిఎఫ్, ఇఎస్ఐ కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఏపి టూరిజం 2024 - 29 పాలసీ క్రింద కొన్ని వందల కోట్లు రాయితీలు ఇస్తున్నామని చంద్రబాబు ప్రభుత్వం సమర్ధించుకుంటున్నదని అన్నారు. ఆర్కే బీచ్ లూలూ మాల్ షాపింగ్ మాల్ ఒప్పందం పెద్ద అవినీతి మాయ. ఎటువంటి పారదర్శకత లేదన్నారు.

సైన్స్ సిటీని నిర్మించాలని తీర్మానం...

ఆర్కే బీచ్ అనేది దేశంలో ఒక అద్భుతమైన, అరుదైన ప్రకృతి సుందర సముద్ర తీరమని, విశాఖ ప్రజలేకాదు, మనరాష్ట్రమే కాదు, రోజు అనేక రాష్ట్రాల నుండి వేలమంది ఆర్కే బీచ్ సందర్శించి ఆహ్లాదం, ఆనందం, వినోదం, విజ్ఞానం, గొప్ప అనుభూతిని పొందుతారని, విశాఖలో వందల షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు ఉన్నాయని, ఇటువంటి అరుదైన భూమిని ప్రైవేట్ వారి వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదన్నారు. దీనివల్ల విశాఖలో ఉన్న వందల షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు మూతపడి వేలమంది ఉపాధి కోల్పోతారని, అంతే గాక మొత్తం ఆర్కే బీచ్ డంపింగ్ యార్డుగా మారిపోతుందన్నారు. బీచ్ సహజ ప్రకృతి సౌందర్యం, పర్యావరణం మొత్తం నాశనమౌతుంది.

అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. 13.78 ఎకరాల భూమిలో సైన్స్ సిటీని లేదా సైన్స్ పార్క్‌ను నిర్మించాలన్నారు. అంతరిక్ష పరిజ్ఞానం, ఖగోళ విజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేదస్సు), క్వాంటమ్ టెక్నాలజీ వంటి ఆధునిక టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక దృశ్యాలను ప్రజలు తెలుసుకోవటానికి అద్భుతమైన సైన్స్ సిటీని నిర్మించాలని ప్రజాసంఘాలు, పౌర సంస్థల సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో విశాఖ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పౌర వేదిక ఏర్పడింది. రాణి శర్మ ను చైర్ పర్సన్‌గా ఎన్నుకున్నారు.

విద్యార్థి దశలోనే సాంకేతికతపై పట్టు సాధించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: చదువుకునే దశలోనే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని నూతన ఆలోచనలతో సొంతంగా స్టార్టప్ కంపెనీలను పెట్టే స్థాయికి ఎదగాలని బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా. శ్రీధర్ పట్నాయక్ అన్నారు. కళాశాల ప్రాంగణంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆద్వర్యంలో మంగళవారం కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం

నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీధర్ పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజురోజుకు అప్డేట్ అవుతున్న సాంకేతికతపై అవగన పెంచుకోవాలని సూచించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు మాట్లాడుతూ నాలెడ్జ్, నూతన ఆలోచనలు ఎవరి సొత్తు కాదని, ఆలోచన విధానం, కృషి, పట్టుదల ఉంటే ప్రతీ విద్యార్థి ఏదో ఒక స్టార్టప్ కంపెనీని పెట్టగలరని అన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివ ప్రసాద్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు మాధురి, దుర్గాప్రసాద్, అమూల్య, శ్రావణ్ కుమార్, ఆనంద్, నూర్జహాన్, భవాని, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ కామేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులలో ఆర్థరైటిస్ నిర్వహణ ముఖ్యం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆర్థరైటిస్ అనేది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వృద్ధుల జీవితాలను ఇబ్బంది పెడుతోంది. ఇది తరచుగా వృద్ధాప్యంలో అనివార్యమైన భాగంగా పరిగణించబడుతున్నప్పటికీ ఆర్థరైటిస్‌ను ఆలోచనాత్మకమైన జాగ్రత్త, జీవనశైలి సర్దుబాట్లు మరియు పుష్కలమైన మద్దతుతో సర్దుబాటు చేసుకోవచ్చు అని లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి. ఉమామహేశ్వర అన్నారు. ఆర్థరైటిస్ అనేది 100 కంటే ఎక్కువ రకాల కీళ్ల రుగ్మతలకు ఒక సాధారణ పదమని, వృద్ధులలో అత్యంత సాధారణమైన రెండు రకాలు ఆస్టియో ఆర్థరైటిస్ మరియు రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్ అనేది కీళ్ల మృదులాస్థి క్రమంగా అరిగిపోవడం వల్ల వస్తుందన్నారు. అయితే రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది స్వయం ప్రతిరక్షక పరిస్థితి, దీనిలో శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున కీళ్లపై దాడి చేస్తుంది, ఇది వాపు మరియు నొప్పికి దారితీస్తుందన్నారు. ఆర్థరైటిస్ రకాన్ని అర్థం చేసుకోవడం మొదటి అడుగు అన్నారు. ఆర్థరైటిస్‌ను నిర్వహించడం అంటే కీళ్ల నొప్పులను తగ్గించడం కంటే ఎక్కువ అని మనం అర్థం చేసుకోవాలి. నిపుణుల సంరక్షణ ద్వారా అయినా, సురక్షితమైన ఇంటి వాతావరణం ద్వారా అయినా లేదా భావోద్వేగ మద్దతు ద్వారా అయినా, ప్రతి వృద్ధుడు వారి ఉత్తమ జీవితాన్ని గడపడానికి ప్రయత్నించాలని చెప్పారు.

క్యాన్సర్ కేర్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన
అపోలో క్యాన్సర్ సెంటర్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: దేశవ్యాప్తంగా కమ్యూనిటీలకు కరుణ, నైపుణ్యంతో కూడిన క్యాన్సర్ సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా క్యాన్సర్ సందేహాలకు 1800-203-1066 హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు విశాఖపట్నంలోని అపోలో క్యాన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, సర్జికల్ ఆంకాలజీ చీఫ్ రోబోటిక్ సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎంపిఎస్ చంద్ర కళ్యాణ్, అపోలో హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ రాకేష్ రెడ్డి, బోయా డాక్టర్ ప్రదీప్ వెంట్రపాటి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విశాఖలోని అపోలో హాస్పిటల్స్‌లో ఈ హెల్ప్ లైన్ నెంబర్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 2040 నాటికి 2.08 మిలియన్ల కేసులకు పెరుగుతుందని అంచనా ఉందన్నారు. 2020 నుండి చూస్తే ఇది 57.5 శాతం పెరుగుదలకు సమానం అన్నారు. సకాలంలో మద్దతు అందించటం, ప్రారంభ దశలోనే చికిత్స అందించటం, నమ్మకమైన సమాచారం పొందటం ఎప్పుడూ సమస్యగానే ఉంటుంది. ఈ అవసరాన్ని తీర్చడానికి, అపోలో క్యాన్సర్ సెంటర్స్ (ఏసిసి) దేశంలో మొట్టమొదటి, పూర్తిగా అంకితం చేయబడిన 24%ఇ%7 క్యాన్సర్ కేర్ హెల్ప్‌లైన్ 1800-203-1066 ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, గ్రూప్ ఆంకాలజీ ఇంటర్నేషనల్- ప్రెసిడెంట్ దినేష్ మాధవన్ మాట్లాడుతూ "భారతదేశంలో మొట్టమొదటి టోల్-ఫ్రీ క్యాన్సర్ హెల్ప్‌లైన్ ప్రారంభించడంతో, అందుబాటులో ఉన్న క్యాన్సర్ సంరక్షణ, ముందస్తు గుర్తింపు, కారుణ్య సంరక్షణ పట్ల మా నిబద్ధతను మేము మరింతగా పునరుద్ఘాటిస్తున్నాము అన్నారు.

పదేళ్ల వారంటీతో న్యూ నిస్సాన్ మాగ్నిట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నిస్సాన్ మోటార్ ఇండియా కొత్త నిస్సాన్ మాగ్నిట్ కోసం 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళికను ప్రారంభించిందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరాబ్ వాట్సా తెలిపారు. ఇది ఒక విభాగం మొదటి కస్టమర్ కేంద్రీకృత చొరవ అని, ఇది నాణ్యత, విశ్వసనీయత బ్రాండ్ యొక్క దీర్ఘకాలిక నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ విజయం సాధించిన వెంటనే ఈ ప్రణాళిక ప్రకటించబడిందన్నారు. మొత్తం ప్రయాణీకుల భద్రతపై 5 స్టార్ రేటింగ్ సాధించిందని, ఏఓపీ (వయోజన ఆక్యుపెంట్ సేఫ్టీ) పై ఖచ్చితమైన 5-స్టార్ రేటింగ్‌తో ఈ ప్రణాళిక 3 సంవత్సరాల ప్రామాణిక వారంటీని అందిస్తుందన్నారు. ఇది 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రణాళిక యొక్క సౌకర్యవంతమైన ప్రణాళికల ద్వారా విస్తరించబడుతుందన్నారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను సైతం ప్రారంభించినట్లు చెప్పారు. "కొత్త నిస్సాన్ మాగ్నైట్ భారతీయ కస్టమర్లకు నాణ్యత, విశ్వసనీయత, భద్రత మరియు దీర్ఘకాలిక విలువకు చిహ్నంగా ఉద్భవించిందని, మరియు గ్లోబల్ ఎన్‌సిఏపి నుండి ప్రతిష్టాత్మక 5 స్టార్ భద్రతా రేటింగ్‌తో ఉందని అన్నారు.

గంభీరంలో వైసిపి సభలో కార్యకర్తల కరువు

నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇన్‌చార్జ్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలు మంగళవారం ఏర్పాటు చేసిన భవన్ బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం భాగంగా పంచాయతీలో నిర్వహించిన సభలో ప్రజల లేకపోవడంతో ఇంచార్జ్ శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు న. గ్రామ శివారులో బీసీ కాలనీ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన సభకు స్థానికులు పెద్దగా రాకపోవడంతో, కార్యక్రమ%శీ% మొక్కుబడిగానే ముగిసింది. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా పేరుగాంచిన గంభీరంలో వైసీపీ నేతల ప్రసంగాలను గ్రామస్తులు నిరాకరించినట్టు సమాచారం. సభకు కార్యకర్తలు కూడా తక్కువ సంఖ్యలో హాజరుకావడంతో, పై స్థాయి నియోజకవర్గ సమన్వయకర్త స్థానిక నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రజాదరణ లోటు కారణంగా ఈ సమావేశం రాజకీయ చర్చలకు దారితీసింది. వైసీపీకి ఈ పంచాయతీలో మద్దతు లేకపోవడం వల్ల, భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలపై పార్టీ వ్యూహం మారే అవకాశం ఉందని అంచనా.ఈ సమావేశంలో జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులతో పిల్లల్లో అనేక శారీరక రుగ్మతలు

చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పిల్లల్లో నులిపురుగుల వల్ల అనేక శారీరక రుగ్మతలు సంభవిస్తాయని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దిలపాలెం అంగన్వాడీ సెంటర్ 4 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు మాత్రలు అందించారు,అనంతరం సీతారాం మాట్లాడుతూ పిల్లల కడుపులో క్రిములు(పొట్టలో నట్టలు)వల్ల కలిగే అనారోగ్య,దీర్ఘకాలిక సమస్యలు లెక్కకు మించి ఉంటాయని అన్నారు,ఒక సంవత్సరం నుండి 19 ఏళ్లు లోపు వయస్సులోపు వయస్సున్నవారంతా ప్రతియేటా ఫిబ్రవరి,ఆగస్టు నెలల్లో రెండు మోతాదులు మాత్రలు నోటి ద్వారా వేసుకోవడం వల్ల ఆకలి మందగించడం,నీరసం,మందకొడి తత్వం, బరువుతగ్గడం, రక్తహీనత,మలద్వారం చుట్టూ దురద వంటి అనారోగ్య లక్షణాలను దూరం చేయొచ్చని అన్నారు. పిల్లలు ముఖ్యంగా ఆరుబయట చెప్పులు లేకుండా మట్టిలో తిరగడం,పరిశుభ్రమైన మంచి నీటిని త్రాగక పోవడం,అపరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం,గోళ్ళు కత్తిరించక పోవడం,భోజనం చేసే ముందు చేతులు శుభ్రపర్చకపోవడం,ఆరుబయట మల విసర్జనల వల్ల ఈ నులిపురుగులు తీవ్రస్థాయిలో ఉత్పన్నమయ్యే అవకాశాలున్నందున యావత్ సమాజం,తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ,అవగాహనతో వీటికి దూరంగా ఉంటే నులిపురుగుల వ్యాధుల నుండి దూరం చేయొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం నగర కన్వీనర్ కె.ఎల్లయ్య,అంగన్వాడీ సెంటర్ కార్యకర్త మాధవి,ఏ.ఎన్.ఎం,ముప్పల సుజాత,ఆశా కార్యకర్తలు రామానుజం లక్ష్మి కుమారి,కె.శ్రీదేవి,పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ భూ కుంభకోణంపై విచారణ జరపాలి

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్



విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ నగరంలోని ఎండాడలో 100 కోట్ల భూ కుంభకోణానికి కారణమైన సర్వేనెంబర్ 14/1 లోని 5.10 ఎకరాల పై కేంద్ర దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఈడీలతో విచారణ జరిపించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ భూమికి సంబంధించి 17 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినందున ఈడీ రంగంలోకి దిగి విచారణ జరపాలని కోరారు. మంగళవారం విశాఖలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొందరు ఉన్నతాధికారులు గత వైసిపి పాలనా కాలంలో విశాఖలో భూకబ్జాదారులుగా పేర్కొన్న ఆ పార్టీకి చెందిన నేతలతో కుమ్మక్కై ఈ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. 2020 సంవత్సరం వరకు ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలలో ఈ భూమి ప్రభుత్వ భూమి అని, గయాలు అని ఖాతా నెంబర్ కూడా ఇచ్చారని గుర్తు చేశారు.అటువంటిది హడావుడిగా ప్రైవేటు భూమిగా ఎలా మారిపోయింది అన్న దానిపై విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇప్పటికీ సిసిఎల్ఏలో కేసు పెండింగ్...

ఈ భూమికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ సిసిఎల్ఏలో కేసు ఇంకా పెండింగ్లో ఉందని ఆ విషయాన్ని దాచి ప్రైవేటు వ్యక్తులకు దీనిని కట్టబెట్టారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ భూమి అయినప్పటికీ ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు క్లైమ్ చేయగా అందులో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి ఒకరికి అప్పచెప్పటమేమిటో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు అన్నింటినీ పరిశీలించి భూమిని కాపాడి ఉండేవారని అమరావతి నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు 22 ఏ నుంచి తొలగించారని ఆరోపించారు. అమరావతి కేంద్రంగా పనిచేసే సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర పేరు ఈ కుంభకోణంలో ప్రముఖంగా వినిపిస్తుందని దీనిపై కూడా విచారణ జరపాలని కోరారు. విశాఖ జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ గా ఉండగా జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ 100 గజాల టిడిఆర్ ఫైల్ పైన కూడా సంతకం చేయలేదని అటువంటి అధికారిపై తీవ్రవత్తిడి తీసుకువచ్చి 100 కోట్ల భూములపై అమరావతి పెద్దలు సంతకం చేయించారని ఆరోపించారు. రికార్డులు ట్యాంపరింగ్ చేసి అక్రమ మార్గాలను అవలంబించిన వారందరిపై చర్యలు తీసుకోవాలని మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు.

ఉత్కంఠభరిత పోరులో బుల్స్ పై రాయల్స్ విజయం

హ్యాట్రిక్ విన్ అందుకున్న క్యాపిటల్ అమరావతి రాయల్స్..



విశాలాంధ్ర - పీఎం పాలెం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ -4లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని ఏసిఏ - విడిసిఏ మైదానంలో జరిగిన 8వ మ్యాచ్‌లో భీమవరం బుల్స్ జట్టుపై అమరావతి రాయల్స్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమవరం బుల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ ల నష్టానికి 191 పరుగులు చేసి పరుగులు చేయగా 192 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన అమరావతి రాయల్స్ మరో 2 బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల నష్టపోయి193 పరుగులు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. అంతకు ముందు ఈ టోర్నమెంట్ లో వరుసగా 8వ సారి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో టాస్ ఓడిపోయి తొలిత బ్యాటింగ్ చేసిన భీమవరం బుల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసి ప్రత్యర్థి ముందు 192 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది.

భీమవరం బుల్స్ బ్యాటర్‌లలో నిమ్మల హిమకర్ 44 బంతుల్లో 6 సిక్సులు 6 ఫోర్ తో 81 పరుగులు, జట్టు వికెట్ కీపర్ రేవంత్ రెడ్డి 50 బంతుల్లో 3 సిక్స్ లు 3 ఫోర్ ల తో 69 పరుగులు చేసి అతడికి అండగా నిలిచారు. వీరివురు కలిసి మొదటి వికెట్ కు 81 బంతులలో 131 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. అమరావతి రాయల్స్ బౌలర్లలో బి.అయ్యప్ప, సంతోష్ కుమార్, బి.వినయ్ కుమార్, టి.అచ్యుత్ కుమార్ లు ఒక్కొక్క వికెట్ తీశారు. అనంతరం 192 పరుగులు విజయ లక్ష్యం తో బ్యాటింగ్ ప్రారంభించిన అమరావతి రాయల్స్ జట్టు బ్యాటర్లు హనుమ విహారి - ఎస్.వి రాహుల్ 36 బంతుల్లో 69 భాగస్వామ్యం తో శుభారంభాన్ని అందించగా చివరిలో 7వ వికెట్ కు ఏ వెంకట విజయ్, పెన్మత్స పాండురంగరాజు 23 బంతుల్లో 37 పరుగులు, 8వ వికెట్ కు ఆకుల వెంకట విజయ్, బండారు అయ్యప్పలు 19 బంతుల్లో 43 పరుగుల కీలక భాగస్వామ్యాలను నమోదు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ మ్యాచ్ లో బ్యాటింగ్ లో రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్న ఎస్.వి.రాహుల్ కి ఏసీఏ వైస్ ప్రెసిడెంట్ పి.వి.ఆర్.ప్రశాంత్ అవార్డ్ కింద పదివేల రూపాయల చెక్కు, మెడల్ అందజేశారు. పవర్ ఫుల్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్న బండారు అయ్యప్ప కి ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ అస్కార్ వినోద్ పదివేల రూపాయల చెక్కు అందజేశారు. బెస్ట్ ఎకానమీ అవార్డ్ అందుకున్న పి.తేజశ్వీకి మాజీ క్రికెటర్ సౌరభ్ తివారీ పదివేల రూపాయల చెక్కు అందజేశారు. అలాగే క్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్న పి తేజశ్వీకి భీమవరం బుల్స్ కో-ఓనర్ శివకాంత్ పదివేల రూపాయల చెక్కు అందజేశారు.